క్లుప్తంగా

సచివాలయాల్లో ఉచిత రిజిస్ట్రేషన్లు

దొర్నిపాడు: ఇళ్ల స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పట్టాలను అందజేసింది. ఆ స్థలాలకు ప్రభుత్వం స్థానిక సచివాలయల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తుందని తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి మంగళవారం సూచించారు. ఫిబ్రవరి నెల 9 వరకు రిజిస్ట్రేషన్లను సంబంధిత వీఆర్ఓ చేయిస్తారన్నారు. డబ్ల్యూ కొత్తపల్లెలో 15 మందికి, అమ్మిరెడ్డినగరంలో 15, అర్జునాపురం 52, బుర్రారెడ్డిపల్లె 69, చాకరాజువేముల 113, దొర్నిపాడు 145, గుండుపాపల 57, కొండాపురం 29, క్రిష్టిపాడు 53, రామచంద్రాపురం 20, డబ్ల్యూ గోవిందిన్నె 53 చొప్పున 621 మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. వీరంతా వెంటనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవలన్నారు.

మాజీ వార్డు సభ్యురాలి మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యురాలు తోట ప్రభావతి (30) మంగళవారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ముత్యాలపాడు గ్రామానికి చేరుకొని తోట ప్రభావతి మృత దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలికి భర్త చిన్న ఓబులేసు, కుమారుడు చరణ్ ఉన్నారు. మృతురాలి కుటుంబానికి అన్నీ విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

పదవీ విరమణ వయస్సు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): సెర్ప్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ గౌరవాధ్యక్షుడు ప్రసాద్, జేఏసీ చైర్మన్ పుల్లయ్య, ఎల్లయ్య, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దానం మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టి ఈపీఎఫ్‌ను బేసిక్ పై 100శాతం ఇవ్వాలని కోరారు. అన్ని క్యాడర్స్ వారికి ప్రమోషన్ కల్పించాలన్నారు. సెర్ప్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో వాడాల రవికుమార్, కృష్ణారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ డేగలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): గుంటూరులో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర పదో మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు ప్రణాళికపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లాబకాష్, సోమన్న, రమణ, మల్లికార్జున, బండి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రాక్టికల్స్ పేరుతో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పేరుతో ఒక్కో విద్యార్థికి రూ.1500 నుంచి రూ.2వేల వరకు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులను మానసికంగా, నైతికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. జూనియర్ కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బాలాజీ, షాహిద్, రవితేజ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ నంద్యాల పట్టణ ప్రధాన కార్యదర్శిగా చల్లా మద్దిలేటి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు, అధ్యక్షుడు కొట్టె చంద్రశేఖర్ మంగళవారం ప్రకటించారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మద్దిలేటి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాధర్, స్వాతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా నంద్యాల

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- నడిగడ్డలో రూ.2.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్లు, డ్రైనేజీలను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): నంద్యాల అభివృద్ధికి చిరునామాగా మారిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 3, 4, 5, 6వ వార్డుల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు హబీబుల్లా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాలతో కలసి ప్రారంభించారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ నంద్యాల ఓల్డ్ టౌన్‌పై ప్రత్యేక దృష్టి సారించి పట్టణాభివృద్ధిలో వైఎస్సార్‌సీపీ ముద్ర వేసిందన్నారు. పట్టణ ప్రజలకు ప్రధాన రహదారులు, తాగునీటి పైప్‌లైన్లు నిర్మించామన్నారు. ముఖ్యంగా నంద్యాల ఓల్డ్ టౌన్ రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ పార్టీకే దక్కుతుందన్నారు. ఓల్డ్ టౌన్‌లోని ప్రతి చిన్న సందులో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి చొరవతో నంద్యాల పట్టణాన్ని జిల్లా కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి పక్షాలు మీ గృహాలకు వద్దకు వస్తాయని, కల్లబొల్లిమాటలు చెప్పి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారానికి తెగబడతున్నాయని, వారి మాయమాటలను నమ్మొదని ఎమ్మెల్యే అన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ముస్లిం మైనార్టీలు టీడీపీ నాయకులకు గుర్తుకు వస్తారన్నారు. చంద్రబాబు నాయుడు గతంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నంద్యాల పట్టణానికి చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధి చేయకపోగా ఉప ఎన్నికల సందర్భంలో నాలుగు రోడ్లు వేసి, ఒక రోడ్డును వెడల్పు చేసి నంద్యాలను మార్చామని చెప్పుకోవడం దారుణంగా ఉందన్నారు. గత పాలకులు నంద్యాల పట్టణాన్ని అభివృద్ధి చేసి ఉంటే ఇప్పుడు ఇన్ని రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు.

ముస్లింలను ఓటుబ్యాంకుగా వాడుకున్న చంద్రబాబు

నంద్యాల ప్రాంతంలోని ముస్లింలను ఎన్నికలకు వాడుకున్న చంద్రబాబు ఎవరికీ గుర్తింపు పొందిన పదవులు ఇవ్వకపోగా.. కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారని రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా అన్నారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నంద్యాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్, 13 మందికి కౌన్సిలర్లు, ఒక కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా కార్పొరేషన్ల డైరెక్టరు కలాంబాషా, శశికళారెడ్డి, సుబ్బరాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, కౌన్సిలర్లు ఆరిఫ్‌నాయక్, సమద్, బాసిద్, సాదిక్, చంద్రశేఖర్‌రెడ్డి, తబ్రేజ్, కో ఆప్షన్‌సభ్యులు పడకండ్ల సుబ్రమణ్యం, సలాముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌బీ, గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గులైన్ వాసులందరికీ పక్కా గృహాల కల్పనే ధ్యేయం

నంద్యాల (సిటీ): బొగ్గులైన్ వాసులందరికీ పక్కా గృహాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా బొగ్గులైన్‌లో నివాసం ఉంటున్న ప్రజలకు పక్కా గృహాలను నిర్మించాలనే చిత్తశుద్ధితో పట్టాలు అందించామని చెప్పారు. మంగళవారం స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ ఛాంబర్‌లో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, చైర్ పర్సన్ మాబున్నిసా ఆధ్వర్యంలో అర్హులైన 68 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి 23 ఎకరాల స్థలాన్ని గాంధీనగర్ వాసులు కోసం భూ సేకరణ చేస్తే.. దానిపై కోర్టుకు వెళ్లిన ఘనత టీడీపీ నాయకులకే దక్కుతుందన్నారు. నేడు నంద్యాల పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న లే అవుట్లను అభివృద్ధి చేస్తుంటే కుందూ పరివాహక ప్రాంతంలో గృహాలు నిర్మించకూడదని మరోమారు ఎన్జీటీలో కేసులు వేశారన్నారు. ఆ కేసులను గెలిచి పేదలకు పట్టాలు ఇస్తుంటే దుష్ప్రచారం చేస్తున్నారని.. అలాంటి వారి మాటలను నమ్మొద్దని సూచించారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, డైరెక్టర్లు శశికళ రెడ్డి, సునీత అమృతారాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, నాయకులు అనిల్ అమృతరాజ్ అధికారులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

అహోబిలేశుడి సేవలో మంత్రి రోజా



స్వామి ఆశీర్వచనం అందుకుంటున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా మంగళవారం దర్శించుకున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తో కలిసి అహోబిలం చేరుకున్న ఆమెకు ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశ్వీవనాలు అందించారు.

జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక

ఆళ్లగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుంచి యువకులు హాజరయ్యారు. ఐదు రకాల బహుళ జాతీయ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 45 మంది యువతీయువకులకు ఉద్యోగవకాశం కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివరామయ్య, నైపున్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి ఆరాధన



ప్రత్యేక అలంకారంలో త్యాగరాజస్వామి



శాస్త్రీయ సంగీత కచేరిలో పాల్గొన్న విద్వాంసులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీసీతా రామ సమేత త్యాగరాజస్వామి దేవస్థానంలో 257వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, అభిషేకాలు, అష్టోత్తర నామాలు, పంచరత్న సేవ కార్యక్రమాలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం నగరంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం తిరుమలతిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ సంస్కృత పండితుడు డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులచే త్యాగరాజ వైభవం, ధార్మిక ప్రవచనాలు, అనంతరం విద్వాంసులచే శాస్త్రీయ సంగీత కార్యక్రమం, హరికథ తదితర కార్యక్రమాలు చేపట్టారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, నిర్వాహకులు రామాయణం శివరామకృష్ణ, శ్రీనివాసులు, సురేష్, మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ



శెట్టివీడు గ్రామంలో మందులను పంపిణీ చేస్తున్న చేస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: జగనన్న ఆరోగ్య సరక్ష వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం గోవిందపల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో సేవలు ఎలా ఉన్నాయి, ఏఏ పరీక్షలను చేయించుకున్నారు అని ప్రజలను ఆరా తీశారు. శిబిరంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల స్పెషలిస్ట్ క్రాంతి కుమార్, జనరల్ ఫిజీషియన్ శ్రీకాంత్, ప్రముఖ కంటి వైద్యుడు కృష్ణమోహన్‌రెడ్డి 502 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు భవ్య, ముఖేష్, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సర్పంచు నక్కా మరియమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

303 మందికి వైద్య సేవలు

చాగలమర్రి: రాష్ట్రంలో నిరుపేద ప్రజల ఇంటి వద్దకే కార్పొరేటు స్థాయి వైద్యాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శెట్టివీడు గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాధిక అన్నారు. మండలంలోని శెట్టివీడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 303 మంది వైద్య సేవలు అందించినట్లు ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యురాలు షేక్ తస్లీం సుల్తానా తెలిపారు.

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిత్రేనిపల్లెలో మంగళవారం సర్పంచులు వరలక్ష్మి, కమలమ్మ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శివాణి, ప్రియదర్శిని, రమేష్ తదితరులు చిత్రేనిపల్లె, హరినగరం, ముకుందాపురం గ్రామాల నుంచి వచ్చిన 456 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో 470 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. వైద్యులు రుహుల్లాఖాన్, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ పయిడేల మాధవీలత, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలందరికీ ఆరోగ్యం చేకూరుతోందని ఎంపీడీఓ అనసూయ, ఎంఈఓ అబ్దుల్ కరీం అన్నారు. మండలంలోని యాళ్లూరు-2 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు జ్యోతివాణి, క్రాంతి చైతన్య, బార్గవి, మురళీ మోహన్ 474 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ రత్యమ్మ, ఉప సర్పంచ్ నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు భారతి, కల్యాణి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో జీవితాల్లో మార్పు



36వ వార్డులో మహిళలతో ఆసరా సంబరాలు చేసుకున్న కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి

నంద్యాల(సిటీ): రాష్ట్రంలోని మహిళల సాధికారతతో జీవితాలు బాగుపడతయని 36వ వార్డు కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 36, 17, 22, 41 వార్డులలో ఆసరా 4వ విడత వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆమె మాట్లాడుతూ మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నరు. మహిళలు ప్రపంచాన్ని శాసించే దిశగా అడుగులు వేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరుతో అక్కా చెల్లెమ్మలను వంచిస్తే నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్నారన్నారు. కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, అబ్దుల్ మజీద్, కృష్ణమోహన్, చంద్రశేఖర్ రెడ్డి, పున్నా రాజేశ్వరి, సుబ్బలక్ష్మి, 3వ పట్టణ అధ్యక్షుడు పున్నా శేషయ్య, వార్డు ఇన్‌చార్జ్‌లు గోపాల్ రెడ్డి, సుబ్బరాయుడు, మెప్మా సీఎంఎం విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించాలి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య

నంద్యాల: జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరించి ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు



జిల్లా కలెక్టర్ వీడ్కోలు సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, నంద్యాల: అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందించానని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయిన జిల్లా కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డీఆర్ఓ పుల్లయ్య, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిగ్నిటరీ రామచంద్ర రావు, అధికారులు, సిబ్బంది కలెక్టర్‌ను సన్మానించారు.

కొనసాగుతున్న కులగణన సర్వే

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో కులగణన సర్వే కొనసాగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 86.77శాతం కులగణన సర్వే పూర్తయినట్లు డీఎల్‌డీఓ మురళీకల్యాణి మంగళవారం తెలిపారు. జిల్లాలో 5,17,301 కుటుంబాలకు సంబంధించిన 13,81,299 మంది సర్వే పూర్తయిందని చెప్పారు. సకాలంలో సర్వే పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూలచే అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శం

నంద్యాల(సిటీ): మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. మంగళవారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరితో శాంతియుతంగా మెలగుతూ గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, డైరెక్టర్లు శశికళారెడ్డి, సునిత అమృతరాజ్, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, అనిల్ అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

నంద్యాల(వ్యవసాయం): ఏపీ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్త, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ వాసవీ క్లబ్ వనిత నంద్యాల ప్రగతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, శైలజ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

➡ పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన గాంధీజీ విగ్రహానికి బీజేపీ నాయకులు అభిరుచి మధు, పట్టణ అధ్యక్షుడు కశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

➡ నంది రైతు సమాఖ్య కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి సమాఖ్య ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, డాక్టర్ ఖాదరబాద్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

➡ బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు బొల్లెద్దుల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవికృష్ణ, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ కాంగ్రెస్ పార్టీ ఏపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చింతలమోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్యల ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆళ్లగడ్డలో..

ఆళ్లగడ్డ : . మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక గాంధీ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కూరపాటి ప్రసాద్, బచ్చు వెంకటరమణ, మల్లికార్జున, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు, యువత, మహిళలు మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు సన్నల సాయిరాంరెడ్డి అన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాసులు, సంపత్, రమణ, సలాం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



మహాత్మ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



ఆళ్లగడ్డలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న విద్యార్థులు



చాగలమర్రిలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

➡ పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, వాసవీ క్లబ్ సభ్యులు



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సన్నల సాయిరాంరెడ్డి